సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



ఒకరికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో శనివారం ఒక వ్యక్తికి కోవిడ్ నిర్ధారణ అయింది. శుక్రవారం సేకరించిన 118 నమూనాలను పరీక్షించగా ఈ ఫలితం వెల్లడైంది.




వాడపల్లిలో భక్తజనవాహిని

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజన గోదారిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు భక్తులు ఆలయానికి తరలివచ్చారు

II లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 3,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 750, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎకరానికి 50 బస్తాల ధాన్యం కొనుగోలు

రైతులకు రాష్ట్ర హోం మంత్రి వనిత భరోసా



కొవ్వూరు: ధాన్యాన్ని విక్రయించుకునే విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత భరోసా ఇచ్చారు. ఎకరానికి 50 బస్తాల చొప్పున కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. , రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రబీలో అధిక ధాన్యం దిగుబడులు రావడంతో రైతుల అభ్యర్థన మేరకు ఆదివారం నుంచి 50 బస్తాల వరకూ కొనుగోలు చేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అని తేల్చింది..నేడు అదే సాగును పండగ అని జగన్ ప్రభుత్వం నిరూపించిందన్నారు. ధాన్యాన్ని విక్రయించుకునే విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఇప్పటికే జిల్లా రైతుల ఇబ్బందులను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కలెక్టర్ కె.మాధవీలతతో మాట్లాడినట్టు చెప్పారు. ధాన్యం పట్టుబడికి వీలుగా రైతులకు ఉచితంగా గోనె సంచులను అందించడంతో పాటు హమాలీలు, రవాణా చార్జీలను సైతం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలులో అవినీతికి ఆస్కారం లేకుండా, దళారీ వ్యవస్థకు తావు లేకుండా ధాన్యం సొమ్మును నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తున్నామన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు మండల, జిల్లా, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

కాళ్ల కింద చెప్పులా పడి ఉండాలా?



తాడిగడప బాలయ్య

నల్లజర్ల: తెలుగుదేశం పార్టీలో 30 ఏళ్లుగా కొనసాగుతూ దళితులకు ఎలాంటి న్యాయం చేయలేకపోతున్నానని దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య వాపోయారు. టీడీపీలోని కొందరు అగ్రవర్ణ నాయకులు తనను ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్నారు. వారి కాళ్ల కింద చెప్పులాగ పడి ఉండాలన్న ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ తన ఆవేదనను ఓ వీడియో రూపంలో శనివారం విడుదల చేశారు. టీడీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు కూడా దళితుడైనప్పటికీ తనను ఖాతరు చేయడం లేదని ఆరోపించారు. ఇతర సామాజిక వర్గ పెద్దలతోనే సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. సర్పంచ్‌గా, దళిత నాయకుడిగా గుర్తించడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ విధానాలు బాగున్నాయి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పనితీరు బాగుందని ఈ సందర్భంగా బాలయ్య పేర్కొన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు తమ పంచాయతీ పరిధిలో రెండు మంచినీటి బోర్లు వేయించారన్నారు.

యువజనం.. నవపథం



- అదిరేటి డ్రెస్సులు.. అధునాతన ఫోన్లు..
- అమ్మాయిలకు పోటీగా డ్రెస్సింగ్‌కు ప్రాధాన్యం
- టాటూలు, మ్యాచింగ్ బూట్లు, చెప్పులు
- దూసుకుపోయే రేస్ బైక్‌ల వాడకం
- అన్నింటా నయా ట్రెండ్

సండే స్పెషల్

సాక్షి, అమలాపురం: ''కుర్రోళ్లోయ్ కుర్రాళ్లు వెర్రెక్కి ఉన్నోళ్లు.. కళ్లాలే లేనోళ్లు కవ్వించే సోగ్గాళ్లు..'' 70వ దశకం చివరిలో వచ్చిన ఓ సినిమాలోని ఈ పాట తెలుగు యువతను ఉర్రూతలూగించింది. అప్పుడే కాదు.. ఇప్పుడు కూడా ఈ పాట యువత తీరును నిత్యనూతనంగా ప్రతిబింబిస్తూనే ఉంటుంది. కాలానుగుణంగా వస్తున్న ఫ్యాషన్లను యువత ఎంతో వేగంగా అనుకరిస్తుంది. ఫుల్ జోష్‌తో ఆ నయా పోకడలను అందిపుచ్చుకుంటుంది. వేసుకునే డ్రెస్సుల నుంచి.. కాలికి తొడిగే బూట్ల వరకూ ప్రతిదీ కొత్త ట్రెండ్‌లో కనిపించాల్సిందే. కొత్త మోడల్ స్పీడ్ బైక్‌లపై రేసు గుర్రాల్లా దూసుకుపోతూంటారు.. మార్కెట్‌లోకి కొత్త ఫోన్ వచ్చిందంటే తమ చేతిలో ఉండాలనుకుంటారు.. చివరకు అమ్మాయిలకు దీటుగా డ్రెస్సింగ్.. హెయిర్ స్టయిల్.. ఇలా అన్నింటా నూతనత్వాన్ని కోరుకుంటున్నారు. నూతనత్వంలో ఆకాశమే హద్దుగా విహరిస్తున్నారు.

▸▸ నేటి యువతరం వాడే సెల్‌ఫోన్ రూ.25 వేలు దాటి ఉండాల్సిందే. ఆపిల్ ఐఫోన్ లేటెస్ట్ సిరీస్ అయితే రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకూ ఉంటుంది. అయినా వెనుకాడటం లేదు. ఐఫోన్ వాడటం ఒక దర్జా.



ఇవే కాదు.. శాంసంగ్, వివో వంటి బ్రాండెడ్ సెల్‌ఫోన్లను ఎంత ధరయినా 'తగ్గేదే.. లే..' అంటున్నారు.

▸▸ డ్రెస్సింగ్‌లో కూడా మ్యాచింగ్‌కు యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. క్యాజువల్ వస్త్రాల్లోనే కాదు.. జీన్స్‌లో కూడా కొత్త ట్రెండ్‌ను అందిపుచ్చుకుంటున్నారు. టోర్న్ (చిరిగిన) జీన్స్‌పై మరింత ఆసక్తి చూపుతున్నారు. షర్ట్‌లు, టీ షర్ట్‌లపై గజిబిజి డిజైన్లు నేటి యువతకు కొత్త రకం ఫ్యాషన్. అందుకు తగినట్టుగా బూట్లు, చెప్పులు కూడా వాడుతున్నారు.

▸▸ 'పచ్చబొట్టు' అంటే ఇప్పటి వారికి పెద్దగా తెలియదు. కానీ టాటూ అంటే మాత్రం ఎక్కడ లేని క్రేజ్. పచ్చబొట్టు పొడిపించుకోవడం కొంత మందికి ఒకప్పుడు సంప్రదాయం. కొంతమంది యువ ప్రేమికులు, భగ్న ప్రేమికులు తమ ప్రేయసి పేర్లను పచ్చబొట్టుగా పొడిపించుకునేవారు. ఇప్పుడు పేర్లు, ప్రేయసీ, ప్రియుల పేర్లతో పాటు పలు రకాల బొమ్మలను టాటూలుగా పొడిపించుకుంటున్నారు. గతంలో పచ్చరంగుల్లో మాత్రమే ఉండే పచ్చబొట్ల స్థానంలో ఇప్పుడు టాటూలు ఎరుపు, పసుపు, నలుపు, పచ్చరంగుల్లో ఒంటిపై కనిపిస్తున్నాయి. రంగురంగుల సీతాకోక చిలుకలు, సింహాలు, పులులు, సినీ నటులు ఫొటోలను కూడా టాటూలుగా వేసుకుంటున్నారు.

▸▸ రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఖరీదైన రేస్ బైక్‌ల వాడకం సైతం యువతకు ఫ్యాషన్‌గా మారిపోయింది. వాటిపై రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా లెక్క చేయడం లేదు.



స్పీడ్ బైక్‌లపై యువత

▸▸ యువకులు హెయిర్ స్టయిల్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. రకరకాల హెయిర్ స్టయిల్స్.. అందుకు తగినట్టుగా రంగులు వేయిస్తున్నారు. వారం వారం ఫ్యాషన్ మారిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా 210 పాపులర్ హెయిర్ స్టయిల్స్ ఉండగా, వీటిలో సుమారు 35కు పైగా మన వద్ద ఆదరణ ఉంది. గెడ్డాలకు సైతం రకరకాల మెరుగులు దిద్దుతున్నారు. ఫేస్‌ప్యాక్, ఫేషియల్‌ను కూడా వదలడం లేదు. రకాన్ని బట్టి ఒక్కో ఫేషియల్‌కు రూ.2 వేల వరకూ వెచ్చిస్తున్నారు.

స్పోర్ట్స్ బైకులపై మక్కువ



స్పోర్ట్స్ బైకులంటే చాలా ఇష్టం. నా బైక్ ఒక్కటే కాదు.. స్నేహితుల బైకులు కనిపించినా చాలు ఒకసారి నడపాలనిపిస్తోంది. కొత్తగా వచ్చే మోటార్ సైకిళ్లు చాలా వేగంగా వెళ్తున్నాయి. ఇప్పుడు తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు చెప్పి బైకులు ఇస్తున్నారు.
– లూటుకూరి గణ వీర మణికంఠ, మాచవరం, అంబాజీపేట మండలం

డ్రెస్సింగ్‌లో కొత్త ట్రెండ్‌కే ఓటు



యువకులు ఎంపిక చేసుకునే డ్రెస్సింగ్‌లో ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. మార్కెట్‌కు కొత్తగా వచ్చే ప్యాంట్లు, షర్ట్‌ల మోడళ్లు మూడు నెలల్లో పాతబడిపోతున్నాయి. యువత అభిరుచికి అనుగుణంగా బెంగళూరు, హైదరాబాద్‌లలో నేరుగా కొనుగోలు చేసి షాపుల్లో ఉంచాల్సి వస్తోంది.
– అరిగెల సురేష్, ఎస్ఎస్ గార్మెంట్స్, అమలాపురం



న్యూ హెయిర్ స్టయిల్



భుజంపై టాటూ

ప్రేమ వ్యక్తం చేయడానికే..



ప్రేమికులు తమ ప్రేమను వ్యక్తం చేసేందుకు టాటూలను అధికంగా వేయించుకుంటున్నారు. యువతలో వీటికి ఆదరణ బాగా పెరిగింది. వీరే కాదు.. భార్యాభర్తలు, తల్లిదండ్రుల పేర్లతో పిల్లలు సైతం తమ ప్రేమకు వ్యక్తం చేసేందుకు వీటి వాడకం పెరిగింది.
– జీవన్, జేడీ వరల్డ్ అధినేత, అమలాపురం



కలెక్టరేట్ నిర్మాణ స్థలం పరిశీలన



మోరంపూడి ఫ్లై ఓవర్‌పనులు పురోగతిపై ఆరాతీస్తున్న ఆర్‌అండ్‌బి ముఖ్య కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కలెక్టరేట్ నిర్మాణం కోసం స్థానిక ఆజాద్ చౌక్ సమీపంలో స్వామి థియేటర్ ఎదురుగా ఉన్న పాత పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాన్ని ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత వివరాలు తెలియజేశారు. జిల్లాలో శాశ్వత కలెక్టరేట్, ఇతర శాఖలకు చెందిన భవనాల నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. సుమారు 7.9 ఎకరాల భూమి ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. నగరంలో కలెక్టరేట్ ఏర్పాటు చెయ్యడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం ఉందన్నారు. తొలుత కొవ్వూరు రోడ్-కం-రైల్ వంతెన వద్ద ఇటీవల జరిగిన మరమ్మతుల పనులను పరిశీలించారు. ఇప్పటికే నిర్మాణం జరిగి 50 సంవత్సరాలు దాటిన సందర్భంగా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులు వివరించారు. అనంతరం నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మోరంపూడి పైవంతెన నిర్మాణం పనులను పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనులను చేపడుతున్న కంపెనీ ప్రతినిధులతో పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందరలో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణి, ఆర్ అండ్‌బీ అధికారులు ఎస్ ఈ హరి ప్రసాద్, ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, డీఈ మధుసూదన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తుల నుంచి స్ఫూర్తి పొందాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సీటీఆర్ఐ: రెండు దశాబ్దాలుగా సేవలందిస్తూ అంకిత భావంతో పనిచేయడం అభినందనీయమని రాష్ట్ర మహిళా కమిషన్ చైరపర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక మోరంపూడి జంక్షన్‌లోని శుభమస్తు పంక్షన్‌హాల్‌లో గోదావరి సేవా మంజీరాలు జిల్లా స్థాయి అయిదో వార్షిక సమావేశం శనివారం రాత్రి జరిగింది. ఇందులో పాల్గొన్న పద్మ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ స్ఫూర్తితో గోదావరి సేవా మంజీరాలు స్థాపించి 5 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, మాటూరి రంగరావులు అభినందనీయులన్నారు. వీరి నుంచి మరికొందరు స్ఫూర్తి పొంది సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్లు, మాజీ గవర్నర్లు పాల్గొన్నారు.

టైమ్స్ నౌ సర్వే నూరుశాతం నిజం

దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వాసిరెడ్డి పద్మ మీడియాకు చెప్పారు. ఆయన పాలనపై ప్రజలకు భరోసా ఉందని, టైమ్స్ నౌ సర్వే నూటికి నూరుపాళ్లు నిజం అవుతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్లుగా జగన్ సారథ్యంలోని ప్రభుత్వ పరిపాలన గమనించినట్లుతే విద్య, వైద్యం ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తరహాలో మాదిరిగా కాకి లెక్కలు చూపించడం లేదన్నారు. కళ్ల ముందు ఇవన్నీ కనపడుతున్నా కొన్ని పత్రికలు విషపు రాతలు రాస్తున్నాయన్నారు. వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు.



పద్మను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



భక్తిశ్రద్ధలతో రంజాన్

జిల్లాలో ముస్లింలు శనివారం ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఈద్గాలన్నీ సందడిగా కనిపంచాయి. కొత్త దుస్తులు వేసుకుని చిన్నాపెద్దా అందరూ మసీదులకు చేరుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఉన్నవారు లేనివారికి ఫిత్రా రూపంలో దానాలు ఇస్తూ కనిపించారు. నమాజ్‌కు వెళ్లే ముందు తప్పనిసరిగా ఈ దానం చేయాలనే ప్రభోదాన్ని అందరూ అనుసరించారు. షేర్ కుర్మా సేవించి ముస్లింలందరూ ఈద్గాల బాట పట్టారు. చాలాచోట్ల సామూహిక ప్రార్థనలు చేశారు. రాజమహేంద్రవరంలో ఎక్కడ చూసినా ముస్లింలు ఉత్సాహంగా కనిపిస్తూ వేడుకలో పాలు పంచుకున్నారు. కంటికి సూర్మా పెట్టుకుని సుగంధ ద్రవ్యాలు దుస్తులపై చల్లుకున్నారు. ఇమామ్ చదివిన ఖురాన్‌ను భక్తి శ్రద్ధలతో విన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



క్లుప్తంగా

డిసెంబర్ నెలాఖరుకు మోరంపూడి ఫ్లై ఓవర్ పూర్తి

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన పనులను వచ్చే డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొవ్వూరు రోడ్ కం రైల్వే వంతెన మరమ్మతులను, మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించామని చెప్పారు. మోరంపూడి, జొన్నాడ, ఉండ్రాజవరం, తేతలి, కైకరం ప్రాంతాల్లో రూ.119 కోట్లతో ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామన్నారు. ఏడాదిన్నరలోగా ఈ పనులు పూర్తి చేస్తారన్నారు. రూ.35 కోట్లతో చేపట్టిన మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్, ఆటో టెస్టింగ్ ఎఫ్‌సీ స్టేషన్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి రథం సమకూర్చిన ఎమ్మెల్యే పొన్నాడ



వీరేశ్వరస్వామికి సమకూరిన నూతన రథం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి వారికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ రథం సమకూర్చారు. సుమారు రూ.15 లక్షలు వెచ్చించి టేకు కలపతో 14 అడుగుల ఎత్తున అద్భుత శిల్పాలతో ఈ రథం సిద్ధమైంది. దీనిని స్థానికుడైన కొల్లేటి వీర వెంకట సత్యనారాయణ తయారు చేశారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున స్వామి వారిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన రథంపై ఇప్పటి వరకూ ఊరేగిస్తున్నారు. ఆలయ అర్చకుల విజ్ఞప్తి, ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ప్రోద్బలంతో ఈసారి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే పొన్నాడ నూతన రథాన్ని సమకూర్చారు. నూతన రథానికి ఈ నెల 25న ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకూ జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరి రోజున స్వామి, అమ్మవార్లకు నూతన రథంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

వాడపల్లిలో భక్తజనవాహిని

- వేంకటేశ్వరస్వామిని దర్శించిన 50 వేల మంది
- రూ.24.60 లక్షల ఆదాయం



స్వామి సన్నిధిలో భక్తజన కోలాహలం (అంతరచిత్రం) ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజనగోదారిగా మారింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పావన గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీ, భూ సమేతంగా కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని వివిధ రకాల పండ్లు, సుగంధభరిత పుష్ప మాలికలతో అర్చకులు అలంకరించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. వారికి ఇబ్బందులు లేకుండా, ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎండ దెబ్బ తగలకుండా చలువ పందిళ్లు, ప్రదక్షిణ మార్గంలో కార్పెట్ ఏర్పాటు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన పర్యవేక్షించారు. వివిధ సేవలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.24,60,078 ఆదాయం సమకూరిందని ఈవో సత్యనారాయణరాజు తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు భూరి విరాళం

- నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి రూ.10 లక్షలు
- దాతను అభినందించిన ఎమ్మెల్యే, విప్ జగ్గిరెడ్డి



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన సత్రానికి పీఆర్ఆర్ డెవలపర్స్ అధినేత పాతపాటి రామాంజనేయరాజు, లక్ష్మి దంపతులు శనివారం రూ.10 లక్షల విరాళం సమర్పించారు. వారు ఈ మొత్తాన్ని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. స్వామి వారి సన్నిధిలో సుమారు రూ.5.50 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో స్థిరపడిన ఆత్రేయపురం వాసి, పీఆర్ఆర్ డెవలపర్స్ అధినేత రామాంజనేయరాజు తన వంతుగా ఈ విరాళం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ, పాతపాటి బ్రదర్స్ పుట్టిన ఊరిలో తమ వంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఆత్రేయపురంలో సుమారు రూ.2 కోట్లతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించారని చెప్పారు. ఆత్రేయపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా పాతపాటి బ్రదర్స్ ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. అన్నదాన సత్రం నిర్మాణానికి భూరి విరాళం సమర్పించిన రామాంజనేయరాజు, లక్ష్మి దంపతులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోచిరాజు బాబూరావు, బిల్డర్ ముదునూరి మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ అనుమానాస్పద మృతి

- ఈ నెల 15న అదృశ్యం
- వారం రోజులకు బావిలో శవమైన వైనం



పాము లక్ష్మి (పాతచిత్రం)

కొత్తపేట: అదృశ్యమైన ఓ మహిళ వారం రోజుల తరువాత బావిలో శవమై కనిపించింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట మండలం వానపల్లి శివారు ఇందిరా నగర్‌కు చెందిన పాము లక్ష్మి (34) జీవనోపాధి నిమిత్తం తన ఇంటి సమీపాన రోడ్డు పక్కన కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తోంది. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో అడ్డ కాలువ సమీపంలోని బండారు గంగరాజుకు చెందిన కొబ్బరి తోటలో పంపుషెడ్డు వద్ద వ్యవసాయ బావి నుంచి దుర్గంధం రాసాగింది. ఆ తోటలో కూలి పని చేసుకునే వ్యక్తి ఆ బావిలో చూడగా మహిళ మృతదేహం కనిపించింది. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారితో పాటు అదృశ్యమైన పాము లక్ష్మి భర్త కాసు కూడా అక్కడకు చేరుకున్నారు. ఆ మృతదేహం తన భార్య లక్ష్మిదేనని కాసు గుర్తించాడు. మృతదేహాన్ని శనివారం ఉదయం బావి నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై వి.మణికుమార్ కేసు నమోదు చేశారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త కూలి పని చేసుకుంటూంటాడు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

కొత్తపేట: తల్లి మందలించిందనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట మండలం వానపల్లి నారాయణపురానికి చెందిన గనిశెట్టి సత్తిబాబు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె దుర్గాభవాని(26)కి అల్లవరం మండలం డి.రావులపాలెం గ్రామానికి చెందిన నల్లా సర్వముఖేష్‌కు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. సర్వముఖేష్ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ రీత్యా ఆ దంపతులు అక్కడే ఉంటున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఒక శుభకార్యం నిమిత్తం భర్త, కుమారుడితో కలిసి భవాని ఈ నెల 9న పుట్టింటికి వచ్చింది. ఆ కార్యక్రమం అనంతరం భర్త హైదరాబాద్ వెళ్లిపోగా ఆమె పుట్టింట ఉంది. ఇదిలా ఉండగా కుమారుడు అల్లరి చేస్తున్నాడని భవాని కొట్టింది. మనవడిని ఎందుకు కొడతున్నావంటూ భవానీని తల్లి వెంకటలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన భవాని శుక్రవారం రాత్రి గదిలోకి వెళ్లి చున్నీతో కిటికీకి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీఆర్ఓ ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు శనివారం ఉదయం పంచనామా నిర్వహించారు. ఎస్సై వి.మణికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో స్నానానికి దిగి బాలిక మృతి



ఉషశ్రీ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కొవ్వూరు: పట్టణ శివారున ఉన్న దండగుండ రేవుల వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన ఓ బాలిక నీట మునిగి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన గుత్తుల ఉషశ్రీ (15), చుట్టుపక్కల స్నేహితులు కలసి శనివారం సాయంత్రం గోదావరిలో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ఉషశ్రీ ప్రమాదవశాత్తూ నదిలో మునిగి, గల్లంతైంది. భయాందోళన చెందిన స్నేహితులు సమాచారం ఇవ్వడంతో స్థానిక జాలర్లు నదిలో వలలు వేసి గాలించగా, ఉషశ్రీ మృతదేహం లభ్యమైంది. ఆమె ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసింది. తల్లిదండ్రులిద్దరూ ఉపాధి నిమిత్తం మహారాష్ట్రలోని ఇందాపూర్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లారు. ఉషశ్రీ, ఆమె అక్క జయశ్రీ, సోదరుడు సూర్యనారాయణ ఇక్కడే తమ ఇంట్లోనే ఉంటూ చదువుకుంటున్నారు. జయశ్రీ డిగ్రీ, సోదరుడు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరి ఇంటి పక్కనే ఉంటున్న పెద్దనాన్న నాగరాజు పర్యవేక్షణలో ఉన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న ఉషశ్రీ మృతదేహాన్ని చూసిన బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలిక మృతి విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. మహారాష్ట్రలోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఉషశ్రీ మృతిపై తమకు ఇంకా ఎటువంటి ఫిర్యాదూ రాలేదని పోలీసులు తెలిపారు.

సఖినేటిపల్లికి ఉత్తమ పంచాయతీ అవార్డు

సఖినేటిపల్లి: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ఉత్తమ పాలనా విభాగంలో సఖినేటిపల్లి పంచాయతీకి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. ఈ మేరకు ఈఓ పీఆర్డీ నుంచి శనివారం సమాచారం అందిందని సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు తెలిపారు. ఈ అవార్డు తీసుకోవడానికి విజయవాడలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సోమవారం వెళ్తున్నామని చెప్పారు. కాగా, ఉత్తమ క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీగా కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బిళ్లనందూరు, వుమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడు పంచాయతీ నిలిచాయి.

రేపటి నుంచి వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- 28 వరకూ నిర్వహణ
- తుది దశకు ఏర్పాట్లు



భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను ఈ నెల 28వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. కోరినదే తడవుగా కోర్కెలు తీర్చే బోళాశంకరుడికి కైలాసంలో బ్రహ్మాది దేవతల ద్వారా ఆది దంపతుల సమక్షంలో వైశాఖ శుద్ధ పంచమి నాడు కల్యాణం జరిగిందని పురాణోక్తి. ఆ ప్రాతిపదికన ఆ స్వామికి పాంచాహ్నిక దీక్షతో శైవాగమ శాస్త్రం ప్రకారం ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య సీతారామశర్మ ఆధ్వర్యాన ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయ ఆవరణలో యాగశాల, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ తదితర పనులు పూర్తయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉత్సవాలు జరగనున్నాయిలా..

- 24న గణపతి పూజ, పంచాగవ్యారాధన, దీక్షధారణ, అభిషేకాలు, అమ్మవారిని, స్వామివారిని వధూవరులను చేయడం, ధ్వజారోహణ, సాయంత్రం భద్రపీఠంపై గ్రామోత్సవం, అనంతరం కల్యాణోత్సవం.
- 25న లక్ష్మీ గణపతి హోమం, ప్రధాన కలశారాధన, వాస్తుపూజ, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, ద్వాదశ ప్రదక్షిణగా ఆలయ ప్రదక్షిణ.
- 26న పంచవింశతి కలశ స్థాపన పూర్వక అభిషేకం, సరస్వతీ హోమం, రుద్రహోమం, సాయంత్రం సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం.
- 27న గవ్యాంతం, చండీహోమం, కళాహోమాలు, సాయంత్రం నంది వాహనంపై గ్రామోత్సవం.
- 28న పూర్ణాహుతి, వసంతోత్సవం, వృద్ధ గౌతమీ గోదావరిలో త్రిశూల స్నానం, స్వామి, అమ్మవార్లకు రథంపై ఊరేగింపు, పుష్పోత్సవం, పవళింపు సేవ.

గంగా పుష్కర యాత్రికులకు కాశీలో ఉచిత భోజనం

రాజమహేంద్రవరం రూరల్: గంగా నది పుష్కరాల సందర్భంగా వారణాసి వెళ్లే ఉభయ తెలుగు రాష్ట్రాల యాత్రికులకు అక్కడి శ్రీ వాసవీ గంగా గోదావరి నిత్యాన్న సేవా సంఘ్ ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తోంది. ఈ మేరకు సంఘ్ అధ్యక్షుడు మన్యం బాబ్జీ సారథ్యాన విస్తృత ఏర్పాట్లు చేశారు. వారణాసి మదన్‌పురా జేకే బ్యాంకు పక్క వీధిలోని జంగంబాడీమఠ్‌లో ఉన్న శ్రీ వాసవీ గంగా గోదావరి నిత్యాన్న సేవా సంఘ్‌లో ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచిత భోజనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ అల్పాహారం అందిస్తామని బాబ్జీ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
IV
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 23-4-2023

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్–బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'ఆహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోఖాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

"మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్లు వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సెనిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్‌ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్) : మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ–ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రొటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం. దేనిపైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం. బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముమ్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్: ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్–బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.



ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.